క్లుప్తంగా

ఓటు వినియోగంపై కళా ప్రదర్శన



వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం తెలంగాణ సాంస్కృతిక సారధి రాగుల శంకర్ బృందం ఓటు వినియోగంపై కళా ప్రదర్శన నిర్వహించారు. ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు గోల్కొండ బుచ్చన్న, ఈర్ల సాగర్, రహీమొద్దీన్, రాజేందర్, విజయ్, తిరుపతి, కుమార్, సురేష్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రేగొండ: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని చెన్నాపూర్, రూపిరెడ్డిపల్లి, దమ్మన్నపేట గ్రామాలలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడితే కేసుల పాలవుతారని, తద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు.

టేకుమట్ల: ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని కుందనపల్లిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌లో కేసులు నమోదైతే ప్రతీసారి ఎన్నికల సమయంలో బైండోవర్ చేయాల్సి ఉంటుంది కావున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సుమన్, మహేందర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంలో పూజలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని భూపాలపల్లి నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు (ఐఆర్ఎస్) కౌశిక్‌రాయ్ శనివారం దర్శించుకున్నారు. స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అక్కడ ఆయనను అర్చకుడు ప్రశాంత్‌శర్మ సన్మానించి తీర్థ ప్రసాదం అందజేశారు. ఆయన వెంట ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియామకం

కాళేశ్వరం: కాళేశ్వరం గ్రామానికి చెందిన మెంగాని అశోక్‌ను మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, ఏఐసీసీ సెక్రటరి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, ఎంపీపీ రాణీబాయ్, ఎంపీటీసీ మమత, వార్డు సభ్యురాలు స్వరూప తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

రేగొండ: మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అజ్మీర్ పాషా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు శనివారం పరామర్శించి రూ.13 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోటిలింగం, మాదురి ముక్తీశ్వర్, గన్‌రెడ్డి మనోహర్ రెడ్డి ఉన్నారు.

రూ. 97వేల నగదు సీజ్



శాయంపేట : వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 97 వేల నగదు పట్టుబడింది. ఈ సంఘటన మండలంలోని పరకాల హనుమకొండ ప్రధాన రహదారి మాందారిపేట స్టేజి వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పరకాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సిద్ధంశెట్టి నితిన్ ద్విచక్ర వాహనాన్ని, బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ. 97వేల నగదు లభించినట్లు సీఐ తెలిపారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా సీజ్ చేసి పరకాల ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి సాక్ష్యం

- నత్తనడకన పస్రా– లింగాల రోడ్డు పనులు
- ముందుకుసాగని వైనం
- నిబంధనలకు పాతర
- పట్టించుకోని అధికారులు
- జనాలకు తప్పని తిప్పలు



పనులు చేపట్టిన రోడ్డు ఇదే..

ఎస్ఎస్ తాడ్వాయి: పస్రా నుంచి లింగాల బీటీ రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. పస్రా నుంచి లింగాల వరకు రూ.20కోట్లతో 27 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కానీ, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారీతిన పనులు చేపడుతున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రోడ్డు తవ్వి కంకపోసి చదును చేయకుండా వదిలేయండంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. లారీలతో దుమ్ము లేవడంతో వాహనాదారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పైపైనే పనులు

పస్రా నుంచి లింగాల వరకు సాగుతున్న రోడ్డు పనులు పైపైనే చేపడుతున్నారనే వాహనాదారులు ఆరోపిస్తున్నారు. 27 కిలోమీటర్ల వరకు పాత బీటీ రోడ్డును తొలగించడంతోపాటు రోడ్డుకు ఇరుపైలా వెడల్పు చేస్తున్నారు. రోడ్డు విస్తీర్ణం పనుల్లో ఇరువైపులా 8 ఇంచుల లోతు తవ్వి కంకరపోయాల్సి ఉండగా అక్కడక్కడ 6 ఇంచులు మాత్రమే తవ్వి అధికారుల కంటపడకుండా కంకరపోసి చదును చేస్తూ నిబంధనలను పాతరేస్తున్నారనే జనాలు ఆరోపిస్తున్నారు. మారుమూల ప్రాంతంలో రోడ్డు పనులు జగరడంతోపాటు అధికారులు ఎన్నికల బిజీబిజీలో ఉండడంతో రోడ్డు పనుల నాణ్యతను పట్టించుకోకపోవడంతో పనుల్లో నాణ్యత లోపిస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై కంకర పోసి చదును చేయకుండా వదిలేయడంతో రాకపోకలకు అంతారయం ఇబ్బందిగా మారిందని వాహనాదారులు వాపోతున్నారు. రోడ్డుపై చిందరవందరంగా కంకర రాళ్లు ఉండడంతో రాత్రి వేళలో రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం పస్రా నుంచి లింగాల వరకు బీటీ రోడ్డు నిర్మించిన కొన్నాళ్లకే రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది.

జాతర వరకు పూర్తయ్యేనా..?

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర నాటికి రోడ్డు పనులు పూర్తయ్యేనా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, గుండాల నుంచి లింగాల మీదుగా పస్రా నుంచి మేడారం జాతరకు భక్తులు వాహనాల్లో వెళ్తుంటారు. జాతర వరకు పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఈనెల 30 ఎన్నికలు జరగనున్నాయి. సమస్యాత్మక అటవీ గ్రామాలైన లింగాల, బంధాల గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ ఆఫీస్లు, సిబ్బంది, అధికారులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి ఉంది. ఈ లోగా రోడ్డు పనులు పూర్తి కాకపోతే పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో వెళ్లే అధికారులకు రాకపోకలకు ఇబ్బంది తప్పేలా లేదు. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వాహనాదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఓట్ల కోసం నోట్ల కట్టలు తెచ్చారు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: ఎన్నికల్లో ప్రజల ఓట్లను కొనుగోలు చేసేందుకు కొన్నిపార్టీల నేతల కోట్ల రూపాయల కట్టలతో వచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క(అనసూయ) అన్నారు. మండలంలోని ఒడ్డుగూడెం, కొడిశాల, లింగాల, బోటిలింగాల గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకు నొక్కాలని చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారనే తప్ప ప్రజలకు చేసేదేం లేదన్నారు. ఎమ్మెల్యేగా మీ ఇంటి ఆడబిడ్డగా ప్రజల మధ్యలోనే ఉండి ప్రజల సమస్యల కోసం పోరాడిన వ్యక్తిగా తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేసే డబ్బులు ప్రజలవేనని డబ్బులను తీసుకుని స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరారు. కష్టాకాలంలో అండగా ఉన్నది ఎవరేది ప్రజలు గుర్తు పెట్టుకుని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో మహిళలకు సీతక్కకు బతుకమ్మలతో ఘనస్వాగతం పలికారు. మహిళలతో కలిసి సీతక్క నృత్యాలు చేసి సందడి చేశారు. పలువురు యువకులు సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, గౌరవ అధ్యక్షుడు అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్ హుస్సేన్, జిల్లా నాయకుడు అరెం లచ్చుపటేల్, సర్పంచులు ఊకె మౌనిక, సునీల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్రం కోళ్ల తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ ఆగబోయిన రామయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు యానాల సిద్దరెడ్డి, లక్ష్మయ్య, నారాయణ, మాజీ ఎంపీటీసీ పోతరాజు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సమ్మయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఏటూరునాగారం వాసికి డాక్టరేట్



కిషోర్‌కుమార్

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన కాతా కిషోర్‌కుమార్ కాకతీయ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈనెల 1న హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ఉపకులపతి చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను కిషోర్‌కుమార్ స్వీకరించారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే డాక్టరేట్ పొందడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఉద్యమకారులపై బీఆర్ఎస్ చిన్నచూపు

- కేసీఆర్‌ను నమ్మి ఉద్యోగం వదులుకున్న
- బీఆర్ఎస్ రెబల్‌గా బరిలో ఉంటా..
- పోరిక పోమానాయక్



పోమానాయక్

ములుగు రూరల్: తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటంతోపాటు ఉద్యోగాన్ని సైతం వదులుకొని పార్టీలో కొనసాగుతున్న ఉద్యమకారులను భారత రాష్ట్ర సమితి చిన్న చూపు చూస్తుందని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ రెబల్ అభ్యర్థి పోరిక పోమా నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేస్తున్న నాయకులను సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తానని హామీ ఇవ్వడంతో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న తాను 9 సంవత్సరాల ఉద్యోగ సర్వీస్ వదులుకుని రాజీనామా చేసి పార్టీలో చేరినట్లు చెప్పారు. పార్టీలో సీనియర్ నాయకులను పట్టించుకోకుండా నిన్న, మొన్న జాయిన్ అయినవారికి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. 2018 ఎన్నికల్లో టికెట్ అజ్మీరా చందూలాల్‌కు ములుగు టికెట్ కేటాయించి తనకు ఎమ్మెల్సీ టికెట్ కేటాస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి మరోసారి మోసం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటానని అన్నారు. ఆత్మీయులను కలుపుకొని నామినేషన్ దాఖలు చేస్తానని తెలిపారు. ములుగు నియోజకవర్గంలో ప్రజలకు ఉద్యమ కాలం నుంచి పరిచయస్తుడిగా ఉన్న తనను ఆదరించి గెలిపించాలని కోరారు.

తెలంగాణ ఇచ్చిన పార్టీని ఆదరించాలి



ములుగు రూరల్: కన్నాయిగూడెంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ అహ్మద్‌పాషా



ఏటూరునాగారంలో..

ములుగు రూరల్: తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కాశిందేవిపేట సర్పంచ్ ఎండీ అహ్మద్‌పాషా అన్నారు. ఈ మేరకు శనివారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కన్నాయిగూడెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ములుగు నియోజకవర్గంలో ప్రజలకు అండగా ఉంటున్న ఎమ్మెల్యే సీతక్కను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. తెలంగాణలో నిరంకుశ పాలన కొనసాగుతుందని అన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే ధనిక రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కన్నాయిగూడెం సర్పంచ్ అల్లెం సదానందం, గ్రామ కమిటీ అధ్యక్షుడు దండు అశోక్ , గ్రామస్తులు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సీతక్కను ఆదరించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్లావుల అశోక్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాసం రవికుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మండల అధ్యక్షుడు ఓంప్రకాష్, నాయకులు షకీల్, ఓడ రాజు, సుధాకర్, ఓరుగంటి అనిల్, ఓరుగంటి క్రిష్ణ, అభినవ్ పాల్గొన్నారు.

సీతక్కను గెలిపించాలని అభ్యర్థన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జమా మజీద్ వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, నియోజవర్గ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్కను గెలిపించాలని అభ్యర్థించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిటమట రఘు, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ సిరాజ్, టౌన్ అధ్యక్షుడు ఎండీ సులేమాన్, టౌన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫారూక్ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

గోవిందరావుపేట : చల్వాయి, సోమలగడ్డ, ఫ్రూట్ ఫారం, పోచంపల్లి గ్రామాల్లో బూత్ ఇన్‌చార్జ్ దేవరపల్లి మల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్వాయి ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు. వేల్పుగొండ ప్రకాష్, తాటి హనుమంతరావు, పెద్దపురం మొగిలి, గద్దల సాంబలక్ష్మి, పోశాల రాజు కుమార్, కాసర్ల రాంబాబు, కందాల వెంకన్న పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలకు చర్యలు



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఏటూరునాగారం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తహసీల్దార్ సృజన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్న ఐదు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లు, సిబ్బందికి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తాగునీరు, విద్యుత్, బాత్‌రూమ్స్, దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంపుల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓల పేర్లు, వారి సెల్ నంబర్లను నమోదు చేయించామని, ఓటర్ల సమస్యలుంటే వెంటనే ఆయా పరిధిలోని బీఎల్ఓలకు కాల్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ జూనియర్ అసిస్టెంట్ రాములు ఉన్నారు.

మభ్యపెట్టడం అలవాటుగా మారింది



సమావేశంలో మాట్లాడుతున్న కొత్త సురేందర్

ములుగు రూరల్: ప్రతి ఎన్నికల్లో ఆదివాసీ నాయకపోడ్‌లను మభ్యపెట్టి ఓట్లను దండుకోవడం అన్ని రాజకీయ పార్టీలకు అలవాటుగా మారిందని ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం గట్టమ్మ ఆలయం వద్ద పూజారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నాయకపోడ్ పూజారులు ఏకతాటి పైకి రావాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధనకు సహకరించే పార్టీకి మద్దతు తెలపాలని అన్నారు. ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘానికి జిల్లా కేంద్రంలో ఎకరం భూమి కేటాయించడంతోపాటు నియోజకవర్గంలోని 28 లక్ష్మీదేవర ఆలయాల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. నాయకపోడ్ రాష్ట్ర మహిళ నాయకురాలు, భాగ్యలక్ష్మీ, లక్ష్మీ, గట్టమ్మ ప్రధాన పూజారులు, సదయ్య, మొగిలి, క్రిష్ణ, శ్రీను, రాజ్‌కుమార్, రాజేష్, రమేష్, మహేందర్, సరోజన, కొమురమ్మ, రాజు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- పాత అయ్యవారి పేట పురాతన శివాలయం వద్ద ఘటన
- ఆందోళనలో అయ్యవారిపేట, ధర్మవరం గ్రామాల ప్రజలు



నిధుల కోసం తవ్విన గుంత

వాజేడు: గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం గుంతను తవ్వడం మండలంలో శనివారం కలకలం రేపింది. మండల పరిధిలోని గోదావరి ఒడ్డున ఉన్న పాత అయ్యవారి పేట గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయం గోడను ఆనుకుని గుప్త నిధుల కోసం సుమారుగా 6 అడుగుల లోతులో గుంత తీశారు. గుంతలో పసుపు, కుంకుమ వేసి పూజలు చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. గుప్త నిధుల కోసం గుంతను తవ్వడంతో అయ్యవారిపేట, ధర్మవరం, భువనపల్లి, టేకులపేట, కోరకల్ గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్తీక మాసంలో ఈ గుడి వద్ద నిత్య పూజలు జరుగుతాయని అలాంటి చోట ఇలాంటి ఘాతుకం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరుతున్నారు. గుప్త నిధుల కోసం గుడి పక్కన కందకం తవ్వడం క్షుద్ర పూజలకు సంబంధించిన సామగ్రి ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

పేదలకు ఇళ్లు కట్టించాకే.. ఇల్లు కట్టుకుంటా..

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి



ప్రచారం నిర్వహిస్తున్న నాగజ్యోతి, నాయకులు

కన్నాయిగూడెం: నియోజక వర్గంలోని ఇళ్లులేని పేదలకు ఇళ్లు కట్టించాకే తాను ఇల్లు కట్టుకుంటానని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సమ్మయ్య ఆధ్వర్యంలో శనివారం తుపాకులగూడెం నుంచి ఏటూరునాగారం వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతికి వివిధ గ్రామాల ప్రజలు బతుకమ్మలతో స్వాగం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు పక్కా ఇళ్లు కట్టిస్తానని తెలిపారు. గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన నాయకులు అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. మళ్లీ ఆరు గ్యారంటీలతో ముందకు వస్తున్నారన్నారు. వారి మరో సారి నమ్మి మోసపోవద్దన్నారు. తనను ఆదరించి గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత వారం రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిన కన్నాయిగూడెం బీఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు చిట్టెం శ్రీనివాస్ తిరిగి తన అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. అదే విధంగా బీజేపీ ముప్పనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నరెడ్ల తిరుపతయ్య, సీపీఎం నాయకుడు మంచాల రామారావుతో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, సీనియర్ నాయకులు కావిరి చిన్నికృష్ణ, పూజారి కిషోర్, మంతెం వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ నరెడ్ల అశోక్, సర్పంచులు కావిరి పద్మ, దుర్గం నారాయణ, ప్రభాకర్ సాగర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును అసెంబ్లీకి పంపించండి

- గట్టమ్మ తల్లికి పూజలు చేసిన బీఎస్పీ అభ్యర్థి జంపన్న



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

ములుగు రూరల్: ములుగు నియోజకవర్గ సమస్యలపై ప్రశ్నించే గొంతుకను గెలిపించి అసెంబ్లీకి పంపించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జంపన్న కోరారు. ఈ మేరకు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు నరేష్ ఆధ్వర్యంలో మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి మేడారం వరకు బైక్ ర్యాలీ నిర్వహించగా జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే అభ్యర్థి జంపన్న, తన కుటుంబ సభ్యులతో కలిసి గట్టమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర, సారెలతో పాటు పుసుపు–కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలో గతంలో గెలిచిన ఎమ్మెల్యేలు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో కనీసం రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోసం చేస్తున్నాయి



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ములుగు : పదేళ్లుగా బీఆర్ఎస్, 20 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ మాదిగలకు మాయమాటలు చెప్పి మోసం చేస్తునే ఉన్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఈ నెల 11వ తేదీన ఎస్సీ వర్గీకరణ చేయాలని హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఇందులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ, మహారాజుల కాలనీలతో పాటు ఇతర కాలనీలలో ఎమ్మార్పీఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన సన్నాహక సభలో ఆయన మాట్లాడారు. మాదిగల వర్గీకరణ చేయకపోతే జాతికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వరంగల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అఖిల పక్షాలను ఢిల్లీకి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ కాలయాపన చేస్తు మోసం చేస్తున్నారనే విషయాన్ని మాదిగలు గమనించాలన్నారు. సీఎం కేసీఆర్ స్వలాభం కోసం కూతురు కల్వకుంట్ల కవితను కాపాడేందుకు కేంద్రంతో లోపాయికార ఒప్పందం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. మాదిగ జాతి అభ్యున్నతికి కట్టుబడి హైదరాబాద్‌లో జరగనున్న మహాసభకు ప్రధానిని తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి మాదిగలంత ఏకమై అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిల పీరయ్య, అనుబంధ సంఘాల ఇన్‌చార్జ్‌లు నెమలి నర్సయ్య, వావిలాల స్వామి, నత్తనూరి రమేష్, పుల్లూరి కర్ణాకర్, కల్లెపల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీపీయూఎస్ మండల అధ్యక్షుడు కె.రఘుపతి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అప్పటి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని తొలగించి కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తీసుకవచ్చిందని దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతన్నారని అన్నారు. సీపీఎస్‌ను అంతం చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చే విధంగా రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. అలాగే బదిలీలు అయిన స్కూల్ అసిస్టెంట్‌లను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఎం.రఘుపతి, బుర్ర సదయ్య, జి. భాస్కర్, ఉపాధ్యక్షులు ఎం.అశోక్, టి.సతీష్, కార్యదర్శి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.